రాష్ట్రంలో అపోలో ప్లాంట్!

రూ.150 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ (ఏఎంఎస్ఎల్).. రాష్ట్రంలో రూ.150 కోట్ల పెట్టుబడితో ఓ రక్షణ పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే యోచనలో ఉన్నది. హైదరాబాద్‌లో 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ప్రతిపాదిత ప్లాంట్‌ను తీసుకొచ్చే అవకాశాలున్నాయి. ఈ మేరకు ఏఎంఎస్ఎల్ ఓ ప్రకటనలో వెల్లడించింది. 'హైదరాబాద్‌లోని హార్డ్ వేర్ పార్క్‌లో మా స్టేట్-ఆఫ్-ది-ఆర్ట్ డిఫెన్స్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని తేవాలని ప్రతిపాదించాం. దీనిపై దాదాపు రూ.150 కోట్ల పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాం' అని సదరు ప్రకటనలో కంపెనీ పేర్కొన్నది. కాగా, ఈ ప్రాజెక్టును 9 నెలల్లో పూర్తిచేయాలని సంస్థ భావిస్తున్నది. అపోలో డిఫెన్స్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధ సంస్థగా ఇటీవలే ఏఎంఎస్ఎల్ మొదలైంది. రక్షణ పరికరాల తయారీకి దీన్ని ప్రారంభించారు. దేశీయంగా మౌలిక, రవాణా, విమానయాన తదితర రంగాల అవసరాల నిమిత్తం కటింగ్-ఎడ్జ్ డిఫెన్స్ సొల్యూషన్స్ కోసం అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఇది పనిచేయనున్నది. ఇప్పటికే డీఆర్డీవోతో కీలక ఒప్పందాలను చేసుకున్నట్టు ఏఎంఎస్ఎల్ వ్యవస్థాపక ఎండీ బద్దం కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

ఫార్మాలోకి మళ్లీ మ్యాట్రిక్స్ ప్రసాద్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): మ్యాట్రిక్స్ ప్రసాద్‌గా ప్రాచుర్యం పొందిన నిమ్మగడ్డ ప్రసాద్ తిరిగి ఫార్మా తయారీ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ప్రసాద్‌కు చెందిన ఐక్వెస్ట్ ఎంటర్‌ప్రైజెస్ తాజాగా అంతర్జాతీయ ఫార్మా కంపెనీ వయాట్రిస్‌కు ఇండియాలో ఉన్న యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) కార్యకలాపాల్ని కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యింది. ఈ మేరకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. వయాట్రిస్‌కు హైదరాబాద్, వైజాగ్‌లో మూడు చొప్పున భారీ ఏపిఐ యూనిట్లున్నాయి. హైదరాబాద్‌లో ఓ ఆర్‌అండ్‌డీ సదుపాయమూ ఉన్నది. కాగా, డీల్ విలువ ఎంతన్నది ఐక్వెస్ట్, వయాట్రిస్‌లు వెల్లడించలేదు. లావాదేవీ 2024 తొలి త్రైమాసికంలో పూర్తవుతుందని వయాట్రిస్ రెగ్యులేటర్లకు తెలిపింది.

17 ఏండ్ల తర్వాత...

తాజా లావాదేవీతో మ్యాట్రిక్స్ ప్రసాద్ 17 ఏండ్ల తర్వాత తిరిగి ఫార్మా రంగంలోకి వస్తున్నారు. ప్రస్తుతం ఐక్వెస్ట్ ఎంటర్‌ప్రైజెస్ చీఫ్ అడ్వయిజర్‌గా వ్యవహరిస్తున్న ప్రసాద్ 2006లో తన మ్యాట్రిక్స్ ల్యాబ్స్‌ను యూఎస్‌కు చెందిన జెనెరిక్స్ సంస్థ మైలాన్‌కు విక్రయించారు. అటుతర్వాత మైలాన్ మరో ఫార్మా సంస్థతో విలీనమై 2020లో వయాట్రిస్‌గా పేరు మార్చుకుంది. వాస్తవానికి తమ ప్రస్తుత బృందంలో అత్యధికులు మ్యాట్రిక్స్ లాబ్స్‌లో పనిచేస్తున్నారని ఐక్వెస్ట్ తెలిపింది. నిమ్మగడ్డ ప్రసాద్ కుమార్తె, ఐక్వెస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గునుపాటి స్వాతి రెడ్డి ఈ డీల్‌పై వ్యాఖ్యానిస్తూ మ్యాట్రిక్స్ ల్యాబ్స్ ప్రయాణంలో భాగమైనవారికి ఇది స్వగృహానికి చేరుకున్నట్లేనని అన్నారు ఇప్పటివరకూ ఫార్మా రంగంలో చేసిన పెట్టుబడుల్లో కెల్లా ఇది భారీ మొత్తమని పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్, హెల్త్‌కేర్ విభాగాల్లో ఐక్వెస్ట్‌కు కేర్ హాస్పిటల్స్, ఏఐసీ హాస్పిటల్స్, సెలాన్ లాబొరెటరీస్ తదితరాల్లో పెట్టుబడులు ఉన్నాయి.

మూసివేత దిశగా హెచ్‌ఈసీ

ఉక్కు పరిశ్రమలకు 'మదర్ ఇండస్ట్రీ'గా దానికి పేరు. ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన నవరత్న కంపెనీ అది.

ఇస్రో చంద్రయాన్, ఆదిత్య మిషన్‌లో కీలక పాత్ర దానిది. ఒకానొక దశలో 40 వేల మంది సిబ్బందితో.. 300 శాతం మేర లాభాలతో గ్రేడ్-1 కిలీటం సొంతం. అదే హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ (హెచ్‌ఈసీ)

ఇప్పుడు ఏ క్షణమైనా మూసివేసే దుస్థితికి చేరింది. ఆర్డర్లు ఉన్నా.. పరికరాల తయారీకి డబ్బులు లేవు. ఉద్యోగులు పనిచేసినా జీతాలు ఇవ్వలేని నిస్సహాయత. అదుకోవాల్సిన కేంద్రం ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించకుండా..రుణాలు ఇస్తామని ముందుకొచ్చిన బ్యాంకులనూ అడ్డుకొంటున్నది. ఇదీ మోదీసర్కారు హయాంలో పీఎస్‌యూల ధీనగాథ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

'నవరత్న' గొంతు పిసికేస్తున్న కేంద్రం

ఉద్దీపన ఇవ్వదు.. రుణాలు రానివ్వదు • ఉద్యోగులకు జీతాలు లేక పస్తులు

ఎన్నికల తర్వాత అదానీకి కట్టబెట్టేందుకే కేంద్రం ఇలా చేస్తుందంటూ ఆరోపణలు



ఉద్దెరకు కూడా దొరుకుతలే!

జీతం వచ్చి ఏడాదైంది. చివరకు పైసలేక మా అమ్మకు వైద్యం కూడా చేయించలేకపోయా. ఆమె చనిపోయింది. ఇప్పుడు దుకాణాల్లో ఉద్దెరకు కూడా ఏదీ ఇస్తలేరు. ఫీజులు కట్టలేక మా పిల్లలను స్కూలుకు పంపటం లేదు.

- శశికుమార్, డిప్యూటీ మేనేజర్, హెచ్‌ఈసీ

అదానీకి కట్టబెట్టడానికే

అదానీ గ్రూప్‌నకు అప్పగించడానికే కేంద్రంలోని మోదీ సర్కార్ హెచ్‌ఈసీని నిర్వీర్యం చేస్తున్నది. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల తర్వాత కంపెనీని ప్రైవేట్ పరం చేసే చర్యలు ఊపందుకోవచ్చు.

- అమల్ పాండే, హక్కుల కార్యకర్త

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ప్రభుత్వరంగ సంస్థలను (పీఎస్‌యూ) నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు వేగంగా పావులు కదుపుతున్నది. ఇప్పటికే పలు పీఎస్‌యూలకు తాళం వేసిన మోదీ సర్కార్..తాజాగా మరో సంస్థను మూసివేయడానికి సిద్ధమవుతున్నది. ప్రముఖ ఇంజినీరింగ్ ఉత్పత్తుల సంస్థ హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్(హెచ్‌ఈసీ) రేపో మాపో మూసివేసే దోరణిలో కేంద్ర సర్కార్ సిద్ధమవుతున్నది. నిధులు కేటాయించి ఆదుకోవాల్సిన కేంద్రం..పెడచెవిన పెడుతుండటంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పడిపోయింది.

గతమెంతో ఘనం

కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ హెచ్‌ఈసీని 1958లో స్థాపించారు. రాంచీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ స్టీల్, మైనింగ్, రైల్వేస్, పవర్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్, న్యూక్లియర్ తదితర రంగాల కోసం హెవీ క్యాపిటల్ స్టీల్ ఎక్విప్‌మెంట్‌ను సరఫరా చేస్తుంది. 2.1 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఈ ఇండస్ట్రీ విస్తరించి ఉన్నది. ఇస్రో ఇటీవల ప్రయోగించిన చంద్రయాన్-3, ఆదిత్య మిషన్‌ల కోసం ఇక్కడి ఉద్యోగులు తమ సేవలు అందించారు. అయితే, పీఎస్‌యూల్లో పెట్టుబడులను ఉపసంహరించుకొంటూ.. ఆయా కంపెనీలను ప్రైవేటు పరం చేయడమే లక్ష్యంగా ముందుకు ఉరుకుతున్న మోదీ సర్కారు హెచ్‌ఈసీని క్రమంగా నిర్వీర్యం చేయడం ప్రారంభించింది. ఒకానొక దశలో 40 వేల మంది సిబ్బందితో 300 శాతం లాభాలను ఆర్జించిన హెచ్‌ఈసీ.. ప్రభుత్వప్రోత్సాహం లేకపోవడంతో ఇప్పుడు 3,000 మంది సిబ్బందితో కునారిల్లుతున్నది.

ఉక్కుపాదం మోపారిలా..

హెచ్‌ఈసీ నాణ్యమైన పనితనం తెలిసి ఇస్రో, రైల్వే, కోల్ ఇండియా తదితర దిగ్గజ కంపెనీల నుంచి సుమారు రూ.1,500 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయి. అయితే, నిధుల కొరత కారణంగా 80 శాతం పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. పోటీదారు సంస్థలకు ధీటుగా కంపెనీని ముందుకు తీసుకువెళ్లాలంటే రూ.1,200 కోట్ల నిధులను వెంటనే అందించాలని హెచ్‌ఈసీ అధికారులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదు. హెచ్‌ఈసీని ఆధునీకరించి, ఉద్దీపన ప్యాకేజీ ప్రకటిస్తే, ప్రభుత్వానికి గొప్ప ఆదాయవనరు సమకూరినట్లేనని 2016లో నీతిఆయోగ్ కేంద్రానికి సిఫారసు చేసింది. అయినప్పటికీ, ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. హెచ్‌ఈసీ సంస్థకు కొత్త జవసత్వాలు అద్దడానికి ఎస్బీఐ వంటి బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకువచ్చినప్పటికీ, ప్రభుత్వం ఆ ప్రక్రియలను అడ్డుకొన్నట్లు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. 2.1 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో విస్తరించిన భూములతో పాటు హెచ్‌ఈసీని అదానీ గ్రూప్‌నకు అప్పగించే కుట్రలు జరుగుతున్నట్లు హక్కుల కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

20 నెలలుగా జీతాల్లేవు

గడిచిన రెండేండ్లుగా ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదు సంస్థ. 2,700 మంది వర్క్‌మెన్‌లకు గత 20 నెలలుగా వేతనాలు చెల్లించని సంస్థ.. 450 మంది ఎగ్జిక్యూటివ్‌లకు గత 14 నెలలుగా జీతాల చెల్లింపులు జరుగలేదు. జీతాలు రాక పిల్లల చదువులకు ఇబ్బంది అవుతున్నదని, పూట గడవటం కూడా కష్టంగా మారిందని హెచ్‌ఈసీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే పండ్లు, ఛాయ్ అమ్ముకొని కుటుంబాలను పోషించుకొంటున్నారు. మరికొందరు పీఎఫ్ డబ్బును అత్యవసరాలకు వినియోగిస్తుంటే, మరికొందరు బ్యాంకు నుంచి వ్యక్తిగత రుణాలు తీసుకొంటున్నారు. జీతాల కోసం హెచ్‌ఈసీ వర్కర్లు, ఉద్యోగులు ఒక సంఘంగా ఏర్పడి ఆందోళన బాట పట్టారు కూడా.

ఆర్‌జీఐ విమానాశ్రయానికి మరో గుర్తింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రతిష్ఠాత్మక ఎయిర్‌పోర్ట్ కార్బన్ అక్రిడిటేషన్ సర్టిఫికెట్‌ను అందుకున్నది. కార్బన్ మేనేజ్‌మెంట్‌లో గ్లోబల్ క్లైమేట్ గోల్స్‌కుగాను ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) లెవెల్ 4+ సర్టిఫికెట్‌ను అందజేసిందని జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వర్గాలు వెల్లడించాయి. ఆసియా-పసిఫిక్‌లో ఈ గుర్తింపు పొందిన విమానాశ్రయాల్లో జీహెచ్ఐఏఎల్ 6వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జీఎమ్మార్ హైదరాబాద్ సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు అత్యంత క్లిష్టమైన సవాలుగా మారాయని, గ్లోబల్ కార్పొరేట్ సిటిజన్‌గా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు బహుళ మార్గాలను నిర్మిస్తోందన్నారు. ఈ గుర్తింపు.. పర్యావరణ బాధ్యతపట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందని తెలిపారు.

40 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

సింగరేణి సీఎండీ శ్రీధర్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన సింగరేణి భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గతంలో నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకుంటే రూ.40 వేల కోట్ల టర్నోవర్ సాధించడంతో పాటు రూ.3,500 కోట్ల లాభాలను ఆర్జించవచ్చునని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ అన్నారు. మంగళవారం సింగరేణి భవన్‌లో డైరెక్టర్లు, జీఎంలతో బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేకంగా సమీక్షించారు. దేశవ్యాప్తంగా బొగ్గుకు తీవ్ర డిమాండ్ నెలకొన్నదని, ఈ పరిస్థితులను సంస్థకు అనుకూలంగా మలుచుకొని రోజుకు 2.10 లక్షల టన్నులను ఉత్పత్తి చేస్తే నిర్దేశించుకున్న లక్ష్యాలకు చేరుకోవడం మరింత సులువుకానున్నదన్నారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 314 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంది. గతేడాది కంటే ఇది 7.15 శాతం అధికం. అలాగే రవాణాలో 307 లక్షల టన్నుల లక్ష్యాన్ని మించి 330 లక్షల టన్నులు సాధించింది.

దసరాకు ముందే లాభాల్లో వాటా

సింగరేణి ఉద్యోగులకు గతంలో ప్రకటించిన రూ.1,750 కోట్ల వేజ్‌బోర్డు బకాయిలు చెల్లించామని, అలాగే సీఎం కేసీఆర్ ప్రకటించిన లాభాల్లో 32 శాతం వాటాగా రూ.711.19 కోట్లను దసరా పండుగకు ముందే విడుదల చేయనున్నట్టు ఈ సందర్భంగా సీఎండీ ప్రకటించారు. ఆ తరువాత దీపావళి బోనస్ నుకూడా పండుగకు ముందే కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

మారుతికి ఐటీ షాక్

రూ.2,159 కోట్ల పన్ను నోటీసు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: మారుతి సుజుకీకి ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ పెద్ద షాక్ ఇచ్చింది. 2019-20 సంవత్సరానికి రూ.2,159 కోట్ల పన్ను చెల్లించాలంటూ డ్రాఫ్ట్ అసెస్‌మెంట్ ఆర్డర్ జారీ చేసింది. ఆ సంవత్సరానికి కంపెనీ సమర్పించిన ఐటీ రిటర్న్స్‌లో పేర్కొన్న కొన్ని అంశాల్లో మార్పులు చేస్తూ ఈ ఆర్డర్ జారీ అయ్యింది. అయితే దీన్ని సవాల్ చేస్తామని, తమ ఆర్థిక, ఉత్పాదక కార్యకలాపాలపై ప్రభావం ఉండదని మారుతి స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. తమ అభ్యంతరాల్ని వివాదాల పరిష్కార కమిటీకి దాఖలు చేస్తామన్నది. ఈ వార్త నేపథ్యంలో మంగళవారం కంపెనీ షేరు 2.37 శాతం క్షీణించి రూ.10,327 వద్ద ముగిసింది.

ఉత్పత్తిలో మారుతి కోత

మారుతి సుజుకీ గత నెలలో ఉత్పత్తిని తగ్గించింది. సెప్టెంబర్‌లో 1,74,978 యూనిట్ల వాహనాలను మాత్రమే ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఉత్తత్తిన 1,77,468 యూనిట్లతో పోలిస్తే ఒక్క శాతం తగ్గినట్లు పేర్కొంది. ఎంట్రిలెవల్ కార్లు ఆల్టో, ఎస్-ప్రెస్సో ఉత్పత్తి 70 శాతం తగ్గగా, బాలెనో, సెలేరియో, డిజైర్, వ్యాగన్ ఆర్, సియాజ్‌ల ఉత్పత్తి భారీగా పడిపోయాయి.

10 రోజుల్లో 2,500 డౌన్

పండుగల సీజన్ వచ్చేసింది. పెండ్లిళ్ల సీజన్ రాబోతోంది. అయినా బంగారం ధరల్లో పరుగులు మాత్రం లేవు.

గత నెల 20 నుంచి పసిడి విలువ రోజుకింత చొప్పున పడిపోతూనే ఉన్నది. దీంతో గడిచిన 10 ట్రేడింగ్ దినాల్లో తులం రేటు రూ.2,500 వరకు క్షీణించింది.

మరోవైపు వెండి ధరలూ ఇదే బాటలో నడుస్తున్నాయి. కిలో వెండి రేటు ఈ వారం, 10 రోజుల్లో రూ.3,000 వరకు పతనమైంది. అటు సాధారణ కొనుగోలుదారులు, ఇటు పారిశ్రామిక వినియోగదారుల నుంచి డిమాండ్ లేకపోవడమే ఇందుకు కారణమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయిప్పుడు.

దిగొస్తున్న బంగారం ధరలు • 58వేల దిగువకు చేరిక

మరో రూ.660 తగ్గిన తులం విలువ

రూ.2,000 క్షీణించిన కిలో వెండి రేటు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: దేశీయ మార్కెట్‌లో గత వారం, పది రోజులుగా పసిడి జిలుగులు, వెండి వెలుగులు ఏమీ కనిపించడం లేదు. సాధారణంగా పండుగలు, పెండ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు.. గోల్డ్, సిల్వర్ మార్కెట్లలో సందడి వాతావరణం నెలకొంటుంది. కానీ ఈసారి ఆ పరిస్థితి ఇంకా కానరావడం లేదుమరి. తగ్గుతున్న ధరలకు, పడిపోతున్న డిమాండ్‌కు ఇది అద్దం పడుతున్నది. ముమ్ముందూ మార్కెట్‌లో ఇదే మందగమనం ఆవరించి ఉంటుందన్న అభిప్రాయాలు ఇప్పుడు వినిపిస్తుండగా, ఇప్పట్లో ధరలు పెరిగే వీలు దాదాపుగా ఉండకపోవచ్చన్న అంచనాలూ కొనుగోలుదారులను వేచిచూసే ధోరణిలోకి నెడుతున్నాయి. ఆగితే ధరలు తగ్గి మరింత లాభాన్ని పొందవచ్చన్న తీరు కన్పిస్తుండటమే ఇందుకు కారణమన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

అటు రూ.660.. ఇటు రూ.2,000

మంగళవారం బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. దీంతో తులం పసిడి రేటు రూ.58 వేల మార్కు దిగువకు, కిలో వెండి విలువ రూ.74,000 కిందికి చేరాయి. ఈ ఒక్కరోజే హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ పుత్తడి 10 గ్రాముల ధర రూ.660 తగ్గి రూ.57,380కి దిగొచ్చింది. 22 క్యారెట్ రేటు సైతం రూ.600 క్షీణించి రూ.52,600లకు పరిమితమైంది. ఇలా గడిచిన పది రోజుల్లో తులం ధర రూ.2,500 వరకు దిగిరావడం గమనార్హం. మరోవైపు కస్టమర్ల ఆదరణ లేక మార్కెట్లో కిలో వెండి ధర కూడా గత పది దినాల్లో రూ.3,000 వరకు తగ్గడం గమనార్హం. మంగళవారం ఒక్కరోజే రూ.2,000 దిగింది. అటు ఢిల్లీ మార్కెట్‌లోనూ 10 గ్రాముల పుత్తడి రూ.650, కిలో వెండి ధర రూ.1,800 చొప్పున క్షీణించాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్లలోనూ బంగారం, వెండి ధరలు తగ్గుతున్నాయి. ప్రస్తుతం ఔన్సు గోల్డ్ ధర 1,825 డాలర్ల వద్ద, వెండి ధర 21.10 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నది. డాలర్ ఇండెక్స్ పెరుగుతున్న నేపథ్యంలోనే గోల్డ్ రేట్లు పడిపోతున్నాయని గ్లోబల్ మార్కెట్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఎన్‌సీసీకి 4,206 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, అక్టోబర్ 3: రాష్ట్రానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ మరో రూ.4,205.94 కోట్ల విలువైన మూడు ఆర్డర్లు దక్కించుకున్నది. ఈ ఆర్డర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీల నుంచి లభించినట్టు సంస్థ పేర్కొంది. వీటిలో నీటి విభాగం నుంచి రూ.819.20 కోట్ల ఆర్డర్ రాగా, ఎలక్ట్రికల్ డివిజన్ నుంచి రూ.173.19 కోట్లు, అలాగే రవాణా డివిజన్ నుంచి రూ.3,213.55 కోట్ల విలువైన ఆర్డర్ వచ్చినట్టు పేర్కొంది. వీటిలో రూ.3,213.55 కోట్ల విలువైన ఆర్డర్ జే కుమార్-ఎన్‌సీసీ సంయుక్తంగా చేపడుతున్న భారీ ప్రాజెక్టు నుంచి లభించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది.

ఎల్ఐసీకి జరిమానా నోటీసు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: మూడు అసెస్‌మెంట్ సంవత్సరాలకు సంబంధించి రూ.84 కోట్ల పెనాల్టీని డిమాండ్ చేస్తూ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ)కు ఆదాయపు పన్ను శాఖ నోటీసు జారీచేసింది. ఈ ఆర్డర్‌పై అప్పీలు చేయనున్నట్టు ఎల్ఐసీ తెలిపింది. 2012-13 అసెస్‌మెంట్ ఏడాదికి రూ.12.61 కోట్లు, 2018-19కి రూ.33.82 కోట్లు, 2019-20కి రూ.37.58 కోట్ల చొప్పున పెనాల్టీ విధించినట్టు కంపెనీ వివరించింది.

ఎన్ఎండీసీ ఉత్పత్తిలో వృద్ధి

హైదరాబాద్, అక్టోబర్ 3: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ ఖనిజ ఉత్పత్తిలో 10 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. సెప్టెంబర్ నెలలో 30 లక్షల టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేసినట్లు సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే నెలలో సంస్థ 27.3 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. గత నెలలో 31.1 లక్షల టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. మరోవైపు, ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో సంస్థ 19.56 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా..20.53 మిలియన్ టన్నులను విక్రయించింది.

తెలంగాణ ఇండస్ట్రీకి కిక్కు

రాష్ట్ర ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీ రంగాలపై ఫ్రాన్స్, బొలీవియా దేశాల ఆసక్తి

వచ్చేవారంలో రానున్న ఆయా దేశాల ప్రతినిధి బృందాలు



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని వ్యాపార, వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఫ్రాన్స్, దక్షిణ అమెరికాలోని బొలీవియా దేశాలు ఆసక్తిగా ఉన్నాయి. ప్రధానంగా ఇక్కడి ఏరోస్పేస్, డిఫెన్స్‌తోపాటు ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) రంగాలపై అక్కడి కంపెనీలు దృష్టి పెట్టనున్నాయి. ఈ క్రమంలో నే ఇరు దేశాలకు చెందిన ప్రతినిధి బృందాలు వచ్చే వారం రోజుల్లో రాష్ట్రంలో పర్యటించనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించి దేశ, విదేశీ అగ్రగామి కంపెనీలు కార్యకలాపాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రాన్‌తోపాటు టాటా-బోయింగ్, జీఎమ్మార్ తదితర సంస్థలున్నాయి. విమానాల విడిభాగాలు, ఇంజిన్లు, హెలీకాప్టర్ బాడీ తయారీ విస్తృతంగా జరుగుతున్నది. ఇక జీఎమ్మార్ ఆధ్వర్యంలో విమానాల మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్ఓ)ను నిర్వహిస్తున్నారు. మరోవైపు బోయింగ్-జీఎమ్మార్ సంయుక్తంగా ప్యాసింజర్ విమానాలను కార్గో విమానాలుగా మార్చేందుకు ఉద్దేశించిన కన్వర్షన్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. దేశంలో ఇదే మొదటిది కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్, బొలీవియాకు చెందిన 70 మంది పారిశ్రామికవేత్తల ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో పర్యటించనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది.

ఫ్రాన్స్ రాయబారి ఆధ్వర్యంలో ఈ నెల 10న రాష్ట్రానికి ఆ దేశ ఏరోస్పేస్, డిఫెన్స్ కంపెనీల ప్రతినిధులు రానున్నారు. అయితే అంతకన్నా ముందే రాష్ట్రంలో బ్యాటరీల తయారీకున్న అవకాశాలను పరిశీలించేందుకు బొలీవియా దేశ ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు ఈ నెల 5న రానున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అమర రాజాతోపాటు పలు కంపెనీలు ఈవీలు, బ్యాటరీల తయారీకి దిగిన సంగతి విదితమే. దీంతో బొలీవియాకు చెందిన ఓ ప్రముఖ లిథియం బ్యాటరీల తయారీ కంపెనీ సైతం ఇక్కడి మార్కెట్‌పై దృష్టి పెట్టినట్టు సమాచారం. కాగా, ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రతినిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తోనూ చర్చలు జరుపుతారని చెప్తున్నారు.

హ్యుందాయ్ కార్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: భద్రతకు పెద్దపీట వేస్తున్న ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఇక నుంచి మార్కెట్లోకి విడుదల చేసే ప్రతి మాడల్‌లోనూ ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు ఉంటాయని స్పష్టంచేసింది. ఇటీవల తీసుకొచ్చిన భారత్ ఎన్‌సీఏపీ ప్రోగాంలో భాగస్వాములమవుతున్నట్టు, దీంట్లో భాగంగా ప్రతి మాడళ్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను ఏర్పాటు చేసినట్లు, భవిష్యత్తులో మరిన్ని మాడళ్లను విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. కార్లలో ప్రయాణికుల భద్రత ప్రమాణాలు పరీక్షించి రేటింగ్ ఇచ్చే కొత్త విధానమే ఈ భారత్ ఎన్‌సీఏపీ. మరోవైపు, కంపెనీకి చెందిన మిడ్‌సైజ్ సెడాన్ వెర్నాకు ఫైవ్ స్టార్ రేటింగ్ లభించింది. ప్రయాణికుల భద్రతే తమ మొదటి ప్రాధాన్యతని హ్యుందాయ్ మోటర్ ఇండియా ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ తెలిపారు.

గరిష్ఠ స్థాయిలోనే ద్రవ్యోల్బణం

జీడీపీ వృద్ధి 6.3 శాతం • భారత్‌పై ప్రపంచ బ్యాంక్ అంచనాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో ద్రవ్యోల్బణం గరిష్ఠస్థాయిలోనే కొనసాగుతుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. సమీపకాలంలో ఆహారోత్పత్తుల ధరలు తగ్గినా, అంతర్జాతీయ పరిణామాల కారణంగా ద్రవ్యోల్బణం 5.9 శాతం మేర ఉంటుందని పేర్కొంది. రిజర్వ్‌బ్యాంక్ నిర్దేశిత లక్ష్యమైన 4 శాతానికి ఇప్పట్లో దిగిరాదన్న సంకేతాల్ని ప్రపంచ బ్యాంక్ ఇచ్చింది. ఇక 2023-24లో భారత్ జీడీపీ వృద్ధి 6.3 శాతం ఉంటుందన్న అంచనాల్ని పునరుద్ఘాటించింది. ప్రపంచ అనిశ్చితి పరిస్థితులు ఉన్నా, దేశంలో సర్వీసుల రంగం జోరు కారణంగా మెరుగైన వృద్ధి రేటును సాధించగలుగుతుందని అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్ రిపోర్ట్‌లో కూడా 6.3 శాతం వృద్ధి అంచనాల్నే ప్రపంచ బ్యాంక్ ప్రకటించింది. 2022-23లో భారత్ జీడీపీ 7.2 శాతం వృద్ధిచెందింది. అంతకంటే తక్కువ